క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి: పట్టణంలో ఎల్‌టీ లైన్ మెంటెనెన్స్‌లో భాగంగా శుక్రవారం అర్బన్‌కాలనీలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్బన్‌కాలనీలో ఏర్పడే విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న యానాల దామోదర్ రెడ్డి

భువనగిరిటౌన్ : ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పోరాటాలు నిర్వహించే సీపీఐ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఉప్పల ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, కళ్లెం కష్ణ, ఎండీ ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఏశాల అశోక్, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రామన్నపేట : చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలని మునిపంపుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.స్వామి తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఆర్‌జీ ఎన్‌జీఓ కేర్‌లింక్ వర్కర్‌స్కీం ఆధ్వర్యంలో గురువారం హెచ్‌ఐవీ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మేడి ముకుందం ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మంజుల, త్రివేణిప్రసాద్, రేవతి, మంజుల, సరోజ, హరికిషన్, శ్రీశైలం, సునీత, నాగలక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

గ్రామ పరిపాలన అధికారుల నియామకం

గుండాల : మండలంలోని 20 గ్రామాలకు క్లస్టర్ల వారీగా గ్రామ పరిపాలన అధికారులను నియమించినట్లు తహసీల్దార్ ఎస్.హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుద్దాల గ్రామ ఇన్‌చార్జ్‌గా మాధవి, పెద్దపడిశాల, తుర్కలశాపురం, వంగాల ఇన్‌చార్జ్‌గా వెంకన్న, సీతారాంపురం, మరిపడిగ, మాసాన్‌పల్లి గ్రామాలకు ఎం.కృష్ణ, అనంతారం, బ్రాహ్మణపల్లి, వెల్మజాల, కొమ్మాయిపల్లి గ్రామాలకు ఎ.సైదులు, గుండాల, గంగాపురానికి పి.లింగయ్య, బండకొత్తపల్లి, వస్తాకొండూర్ గ్రామాలకు ఎ.యాకు, రామారం, అంబాల గ్రామాలకు బి.మల్లేష్‌లను నియమించినట్లు తెలిపారు.


విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

అడ్డగూడూరు : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జానకీపురం గురువారం జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అంబటి శంభయ్యకు చెందిన ఎద్దులు మేత మేస్తుండగా ఒక ఎద్దు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో ఆ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

పిడుగు పడి పాడి గేదె..

వలిగొండ : పిడుగు పడి పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని సంగెం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు చిలుకల లింగ స్వామికి చెందిన పాడి గేదెపై బుధవారం రాత్రి పిడుగు పడడంతో మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ. 1 లక్షా 20 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

దుమ్ము లేస్తోంది..!



తుక్కాపురం రోడ్డుపై లేస్తున్న దుమ్ము

ఆత్మకూరు(ఎం) : మండలంలోని తుక్కాపురం-రహీంఖాన్‌పేట మధ్య గల రోడ్డుపై దుమ్ము లేస్తోంది. తుక్కాపురం నుంచి కాప్రాయపల్లి వరకు గల రోడ్డును బీటీగా మార్చేందుకు ప్రభుత్వం రూ. 2.30కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా తుక్కాపురం నుంచి రహీంఖాన్‌పేట వరకు రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో పెద్ద వాహనాలు వెళ్లినప్పుడల్లా రోడ్డుపై దుమ్ము లేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దొడ్డు బియ్యం.. పురుగులపాలు

- ఆరు నెలలుగా రేషన్ షాపుల్లోనే నిల్వలు
- పురుగులు, తెల్లదోమ వ్యాపించి పాడైపోతున్న బియ్యం
- సన్న బియ్యం నిల్వలకు స్థలం కరువు
- ఇబ్బందుల్లో రేషన్ డీలర్లు



రహీంఖాన్‌పేట రేషన్ దుకాణంలో పురుగు పట్టిన దొడ్డు బియ్యం బస్తాలు

ఆత్మకూరు(ఎం) : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే సన్నబియ్యం పంపిణీ నాటికి అన్ని రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం మిగిలి ఉన్నాయి. వాటిని ఏం చేయాలనే నిర్ణయం ఇప్పటి వరకు ప్రభుత్వం తీసుకోకపోవడంతో రేషన్ దుకాణాల్లో గత ఆరు నెలలుగా దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. వాటికి పురుగులు, తెల్లదోమ పట్టి ముక్కిపోతున్నాయి. బియ్యానికి పట్టిన తెల్లదోమ, పురుగులు చుట్టుపక్కలకు వ్యాపిస్తుండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న రేషన్ దుకాణదారులను ఖాళీ చేయాలని లేదా పురుగులు పట్టిన దొడ్డు బియ్యాన్ని మరో చోటుకు తరలించాలని ఇంటి యజమానుల నుంచి ఒత్తిడి వస్తుడడంతో ఏం చేయాలో తెలియక రేషన్ డీలర్లు సతమతమవుతున్నారు. దీనికితోడు నెలనెలా వచ్చే బియ్యం స్టాక్ నిల్వ చేసుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. దొడ్డు బియ్యం సమస్యను జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకపోయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు డీలర్లు వాపోతున్నారు.

27 రేషన్ దుకాణాలు..

మండలంలో మొత్తం 27 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 27 రేషన్ దుకాణాల కింద 9872 రేషన్ కార్డులు కలవు. 190.284 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ప్రతి నెల సరఫరా పంపిణీ చేస్తుంటారు. ప్రస్తుతం ఆయా దుకాణాల్లో దొడ్డు బియ్యం సుమారు 300 క్వింటాళ్ల వరకు గత ఉన్నాయి. దొడ్డు బియ్యం నిల్వలతో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తా



దొడ్డు బియ్యం నిల్వలపై రేషన్ డీలర్లు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి తీసుకరావడం జరిగింది. రిసైక్లింగ్ చేసి ఇవ్వాలని చెప్పడం జరిగింది. డీలర్ల ఇబ్బందులు చెప్పారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– వి. లావణ్య. తహసీల్దార్, ఆత్మకూరు(ఎం)

ఇబ్బంది పడుతున్నాం

మార్చి నెల నుంచి దొడ్డు బియ్యం నిల్వ చేసి ఉన్నాయి. అధికారులకు చెప్పిన పలితం లేదు. తీసుకపోమ్మంటే తీసుకపోతలేరు. దొడ్డు బియ్యం బస్తాలకు పురుగు, దోమలు పట్టి ఇల్లంతా వ్యాపిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– కర్రె రమణమ్మ, రేషన్ డీలరు, రహీంఖాన్‌పేట

బియ్యం పాడైపోతున్నాయి

దొడ్డు బియ్యం ఆరు నెలలుగా నిల్వ ఉండడంతో బియ్యానికి పురుగులు, తెల్లదోమ పట్టి పాడైపోతున్నాయి. బియ్యం రిసైక్లింగ్ చేసి ఇవ్వాలని అధికారులు అంటున్నారు. అలా చేస్తే ఒక క్వింటాకు 30 కిలోల తరుగు వస్తుంది. ఇప్పటికే ఆరు నెలల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తే కమిషన్ కూడా ఇవ్వలేదు. దొడ్డు బియ్యం తరుగును భరించే స్థితిలో డీలర్లు లేరు.

– ఏలూరి వెంకటేశ్వర్లు, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు

ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు



యాదగిరిగుట్ట రూరల్: ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పల్లె దావఖానాను పరిశీలించారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. పల్లె దావఖానాను పరిశుభ్రంగా ఉంచడం, వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ ఆర్ మూల్యాంక, ఆశవర్కర్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

వలిగొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాలు తొందరగా ప్రారంభించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులకు సూచించారు. గురువారం వలిగొండ పీపీపీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లకు గోనెసంచుల, హామాలీలను సమకూర్చుకుని కొనుగోళ్లు తొందరగా ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, సివిల్ సప్లై జీఎం నాగేశ్వర్ రావు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు హరికృష్ణ, రోజా రాణి, బాలమణి, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

భువనగిరి : స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటి సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. గురువారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో జరిగిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిని ఎన్నుకుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కమిటి కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు నాగమణి, గ్రామ శాఖ కార్యదర్శి కాకుంట్ల కృష్ణ, లక్ష్మ య్య, మల్లయ్య, హైమవతి, కుమారి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి



బాకీ కార్డులు పంచుతున్న నాయకులు

మోత్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి విమర్శించారు. గురువారం మోత్కూరు మండలం అనాజిపురంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్‌రెడ్డితో కలిసి బాకీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వస్తే ప్రజలు బాకీ తీర్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గజ్జి మల్లేషం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పానుగుల్ల విష్ణుమూర్తి, నాయకులు కొండా సోంమల్లు, వల్లందాసు వెంకటయ్య,సైదులు, బండ రాజు, మరిపల్లి చంద్రయ్య, కొల్లు శంకర్, బర్రె శంకర్, నిమ్మల సత్యనారాయణ, చేకూరి వెంకన్న, చుక్క కృష్ణ, శేఖర్‌రెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరాం



భువనగిరిటౌన్ : కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వలిగొండలో..

భువనగిరిటౌన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరాం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గందమల్ల లింగస్వామి అన్నారు. పట్టణ కేంద్రంలో బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాం వర్థంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాన్షీరాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మంచాల శ్రీకాంత్, , దయాకర్ మౌర్య, జిల్లా ఇంచార్జి బాసాని మహేందర్, సీనియర్ నాయకులు బట్టు రాంచంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుండు కృష్ణ గౌడ్, వడ్డేపల్లి దాసు, కోయిగురి వెంకటేష్ యాదవ్, కొంగరి బాలరాజ్, సురుపంగా శ్రీకాంత్, కన్వీనర్ సిలువేరు మహేందర్, సుక్క శ్రీకాంత్, గోపి నరేందర్, మౌలానా, మురళి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు సుక్క శ్రీకాంత్, గుండు కృష్ణ, సాయిని యాదగిరి, సంగిశెట్టి క్రిస్టఫర్, మస్కు నరసింహ, చేగురి అజయ్, ఎడవెల్లి చందు,విజయ్ రాజు,కృష్ణ స్వామి,వెంకటేశం, కృష్ణ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేయాలి



మాట్లాడుతున్న మాచర్ల మోహన్‌రావు

భూదాన్‌పోచంపల్లి : చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేయాలని చేనేత జన సమాఖ్య జాతీయ నాయకుడు మాచర్ల మోహన్‌రావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై అసోసియేషన్ భవనంలో చేనేత జనసమాఖ్య ఆధ్వర్యంలో చేనేత సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గించిన మోదీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీని తగ్గించలేదని అన్నారు. చేనేతపై జీరో జీఎస్టీ చేయాలని డిమాండ్ చేశారు. చేనేతను ఉపాధి రంగంగా గుర్తించి చేనేత పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి రూ.1000కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ఆ రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చేనేత సమస్యలపై పలు తీర్మాణాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత వాసుదేవ్, శ్రీ రంజని సిల్క్‌యూనిట్ చైర్మన్ ఎన్నం శివకుమార్, ప్రొఫెసర్ తడక యాదగిరి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చింతకింది రమేశ్, ముస్కూరి నర్సింహ, అఖిలపక్ష చేనేత నాయకులు చిక్క కృష్ణ, గంజి బస్వలింగం, శ్రీహరి, బోడ దయానంద్, శ్యామ్, దామోదర్, వేముల పాండు, వేశాల మురళి, సత్యనారాయణ, మిర్యాల నాగార్జున, మహేందర్, విష్ణు, బింగి భాస్కర్, ఏలే శ్రీను, గజ్జెల రామకృష్ణ, ఈశ్వర్ పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్య



భువనగిరిటౌన్ : నిరసన తెలుపుతున్న నాయకులు

భువనగిరిటౌన్ : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మైనార్టీ జర్నలిస్ట్ ఫ్రంట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ సుజావుద్దీన్, ప్రజా సంఘాల నాయకుడు భట్టు రామచంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ షరీఫ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని న్యాయవాదిని శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ సలహాదారుడు ఇబ్రహీం బియబాని, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ షేక్ హమీద్ పాషా, కోశాధికారి బైరపాక సీరిల్, సహాయ కార్యదర్శి ఎస్ కే హుస్సేన్ , సభ్యులు ఫసిఉద్దీన్, రఫీ ఉద్దీన్ గౌరీ, నాయకులు అంజద్, సీపీఎం నాయకులు మాయ కృష్ణ, మైనార్టీ నాయకులు అమీన్ మైమన్, హనీఫ్ మైమన్, ఎస్ కే మహది హసన్, హాజీ, షకీల్, కబీర్ ఉన్నారు.

ఎమ్మెల్యే ఇంటి వద్ద కోలాహలం

యాదగిరిగుట్ట: స్థానిక సంస్థల ఎన్నికల్లో నేపథ్యంలో పట్టణ కేంద్రంలోని బీర్ల ఐలయ్య ఇంటి వద్ద గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తల కోలాహలం కన్పించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు టికెట్ ఆశించే ఆశావహులతో పాటు వారి వెంట వచ్చిన వారితో ఆ ప్రాంతం సందడిగా కన్పించింది. ఎంపీడీవో కార్యాలయం, పాత గుండ్లపల్లికి వెళ్లే రహదారులు వాహనాలతో నిండిపోయాయి.



ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే దారిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



భువనగిరి : పోషణ మాసోత్సవంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు



భూదాన్‌పోచంపల్లి : ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

భువనగిరి : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని భువనగిరి ప్రాజెక్టు ఏసీడీపీఓ యామిని అన్నారు. మండలంలోని హన్మాపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని గర్భిణులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆరు నెలల పూర్తయిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయగిరి సెక్టార్ సూపర్‌వైజర్ ఉమా, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, ఉమారాణి, నవ్య, ఆయా కమలమ్మ పలువురు అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం- 1లో గురువారం పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను ప్రదర్శనగా ఉంచి వాటిలో లభించే పోషకాలను వివరించారు. అనంతరం చిన్నారులు, తల్లిదండ్రులచే సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ , ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, పుష్పలత, అంగన్‌వాడీ టీచర్ ఎం. జంగమ్మ, ఆయా మంగమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

వాసాలమర్రిలో సామూహిక సీమంతాలు

తుర్కపల్లి : పోషణ మాసోత్సవంలో భాగంగా మండలంలోని వాసాలమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ స్వరాజ్యం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన శిశువులకు ముర్రుపాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, మున్నిసా, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత.. కర్రే హెచ్చరిక

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని గౌస్‌కొండ గ్రామ శివారులో రోడ్డు పక్కనే ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో రాత్రి, పగలు వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చకపోవడంతో స్థానికులు కొందరు వచ్చేపోయే వాహనదారులను అప్రమత్తం చేసేందుకు గుంతలో కర్రను పాతి ప్రమాద హెచ్చరికగా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



గౌస్‌కొండ శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంతలో ప్రమాద హెచ్చరికగా పాతిన కర్ర

'స్థానిక' ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పరిశీలన



రాజాపేట : ఎన్నికల నామినేషన్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ఆలేరురూరల్ : ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను గురువారం కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్‌కు సంబంధించిన హెల్ప్‌డెస్కను, కౌంటర్‌లను, రికార్డులను పరిశీలన చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్‌లు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ ఫారమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, మండల ప్రత్యేకాధికారి సబిత, ఎంపీడీవో నవీన్ కుమార్, తహసీల్దార్ గణేష్ నాయక్,ఏవో సుధారాణి, ప్రిసైడింగ్ అధికారులు తదితరులున్నారు.

రాజాపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నిల నామినేషన్ ప్రక్రియను గురువారం కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓలు శాంతినిర్మల, శ్రీనివాస్, చందా రమేష్, విజయ్‌కుమార్, టీ రాజులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ శంకర్ గౌడ్, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఆవుల కిషన్, మండల పరిషత్ సిబ్బంది, ఏఎస్‌ఐలు ప్రకాష్, యాదయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల నామినేషన్ కౌంటర్లను గురువారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, జెడ్పీటీసీ ఆర్‌ఓ పున్యాల వెంకట రమణారెడ్డి, ఎంపీటీసీ ఆర్‌ఓలు ఎ.విజయ్‌కుమార్, యం.కరుణాకర్ పాల్గొన్నారు.

గుండాల : మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆర్డీఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.హరికృష్ణ, ఎస్ఐ తేజమ్‌రెడ్డి, ఎంపీఓ సలీమ్, జంపాల రాజు, అధికారులు ఉన్నారు. 9 ఎంపీటీసీ స్థానాలకు, జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్లు దాఖలు కాలేదని ఎంపీడీఓ చండీరాణి తెలిపారు.

తుర్కపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ,ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి, జిల్లా పశువైద్యాధికారి జానయ్య, ఎంపీడీఓ లెంకల గీతారెడ్డి ఉన్నారు. మండలంలో మొత్తం 10 స్థానాలు ఉండగా తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ఆత్మకూరు(ఎం): స్థానిక సంస్థల తొలి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను, హెల్ప్‌డెస్కలను గురువారం భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి రాజారామ్, ఎంపీడీఓ జె. రాములు నాయక్, సీఐ హనుమంతు, సూపరింటెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ పద్మావతి తదిరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ కౌంటర్లను గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ జ్యోతి కుమార్, రాజా త్రివిక్రమ్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ చంద్రబాబు, సీఐ శ్రీశైలం, జ్ఞానప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని చౌదరిపల్లి ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున బాతుల చిన్న మల్లు, రామలింగంపల్లి ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ తరపున మైలారం నాగరాణి నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్లు నిల్

మోత్కూరు : మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను గురువారం ప్రారంభించింది. మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల ప్రక్రియను జిల్లా అబ్జర్వర్ డీఆర్‌డీఓ నాగిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ డి.బాలాజి, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, ఎంపీవో పైళ్ల జనార్దన్‌రెడ్డి, హెల్ప్ డెస్క్ బాధ్యులు గంధం శ్రీనివాసరావు, పసునూరి సుధాకర్ తదితరులు ఉన్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రాజాపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఆవుల కిషన్‌లు హెల్ప్‌డెస్కలను పరిశీలించారు. మొదటి రోజు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఆర్‌ఓలు శాంతినిర్మల, రమేష్, శ్రీనివాస్, వెంకటరమణలు తెలిపారు.

యాదగిరిగుట్టలో ఐదు నామినేషన్లు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు నామినేషన్లు స్వీకరించారు. ఎంపీటీసీలకు సంబంధించి 5 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని సాధువెల్లి ఎంపీటీసీ స్థానానికి స్వర్గం నరహరి, పులుగుం భిక్షపతి, ఇప్ప రాజయ్యలు, మాసాయిపేట ఎంపీటీసీ స్థానానికి సగ్గు లక్ష్మి, దాతర్‌పల్లి ఎంపీటీసీ స్థానానికి బత్తిని అనిత నామినేషన్‌ను దాఖలు చేశారు.

రెండు నామినేషన్లు దాఖలు

మోటకొండూర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ ధరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను గురువారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని ఆర్‌ఓ, పీఓలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ నర్సింహ్మారావు, ఎంపీడీఓ ఇందిర, ఎంపీఓ చంద్రశేఖర్, ఏఓ రమాదేవి, సూపరిండెంట్ యశోద, కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కాటేపల్లి ఎంపీటీసీ పరిధిలో పచ్చిమట్ల మదార్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ తరుపున, మాటూర్ ఎంపీటీసీ పరిధిలో మాటూర్ గ్రామానికి చెందిన మంతపురి నరేందర్ నామినేషన్లు దాఖలు చేశారు.